



సాధనను మరింత సానబట్టడానికి అనేక పరీక్షలు పెడుతుంటాడు. అన్నింటినీ ధైర్యంగా భరిస్తూ...శివోపాసన కొనసాగిస్తుంది. "ఇన్ని కష్టాలెందుకు తల్లీ! నేనే నీ ఇంటికి వస్తాను. అక్కడే వ్రతాన్ని ఆచరించు" అని సలహా ఇస్తాడు జంగమయ్య. అయితే వెళ్తూవెళ్తూ వెనక్కి తిరిగి చూడకూడదని నియమం పెడతాడు. ఆమె నడుస్తుండగా... తన మంత్రశక్తితో భీకర శబ్దాలు సృష్టిస్తాడు. ఆ మాయ తెలియని వల్లి వెనక్కి చూస్తుంది. ఇంకేముంది జంగముడు లింగరూపం ధరిస్తాడు. కొంతకాలానికి ఆనందవల్లి కూడా శివసాయుజ్యం పొందుతుంది. అదే ప్రస్తుత త్రికోటేశ్వర స్వామి ఆలయం ఉన్న ప్రాంతం. ఈ సంఘటన గురించి తెలుసుకున్న





సాలంకయ్య త్రికోటేశ్వరుడికీ, ఆనందవల్లికి ఆలయాల్ని నిర్మించాడు. అందుకే త్రికోటేశ్వరుడిని యల్లమంద కోటేశ్వరుడని, కావూరు కోటేశ్వరుడనీ వ్యవహరిస్తారు. అంత భక్త సులభుడా కోటప్పస్వామి! పూజలు చేసిన పుణ్యానికే ఓ భక్తురాలికి దైవత్వాన్ని ప్రసాదించాడు. గుడికట్టిన భాగ్యానికి ఓ భక్తుడికి తన పేరులో భాగమిచ్చాడు.

శివరాత్రి వచ్చిందంటే కోటప్ప ప్రభలు, కొండప్రాంతమంతా విద్యుత్ దీపాలంకృతమైన ప్రభలతో వెలిగి పోతుంది. ముక్కోటి దేవతలూ ముక్కంటిని దర్శించుకోడానికి దివ్యవాహనాల్లో బారులుతీరిన భావన కలుగుతుంది. గుండెగుడిలో 'హరహర మహాదేవ' నినాదాలు వినిపిస్తాయి.

(**చిరుమామిళ్ళ లక్ష్మణరావు**, ఈనాడు, గుంటూరు సౌజన్యం)

మనదైన పండుగా జామపండును భావిస్తాం

-జొంపండురా చెక్కభున్నాయంటూం-





జాంపండురోయ్ అంటాం. 365 రోజులూ జాంపండు బజారుల్లో కనిపించినా సీజన్‌లో దొరికే జాంపండు రుచే వేరుగా ఉంటుంది.

గ్రామాల్లో, పట్టణాల్లో, గృహ ఆవరణల్లో జామ చెట్టు బాగా పెరుగుతుంది. తెల్లగుజ్జుకల జామకాయలు కొన్ని, ఎర్రగుజ్జుగల జామకాయలు కొన్ని! వేటి రుచి దానిదే! కానీ తెల్లగుజ్జుగల దోరజామ కాయలనే చాలామంది తింటారు. అందునా దోర జామకాయను యిష్టపడేవారు చాలా మంది ఉన్నారు. పచ్చి జామకాయల్ను ముక్కలుగా కోసి, ఉప్పు, కారము అద్దుకుని తినేవారున్నారు.

మనదైన పెరటిచెట్టుగా భావించే జామ నిజానికి అమెరికా దేశాల నుంచి వచ్చినదే! మనకన్నా దక్షిణ అమెరికన్లు దీన్ని ఎక్కువగా తింటుంటారు. పండుగా తినడంతోపాటు వంటల్లోనూ వాడతారు. జ్యూస్‌లు, క్యాండీలు, డెజర్ట్‌లు, సలాడ్లు, ఎండు స్నాక్స్‌రూపంలో కూడా తీసుకుంటారు. ఇందులో ఎక్కువ శాతంలో ఉండే పెక్టిన్ కారణంగా క్యాండీలు, జెల్లీలు, జామ్‌లు తయారు చేయడం సులభం. టొమోటాల బదులుగా ఎర్రజామ వాడుతూ సాస్‌లు తయారు చేస్తుంటారు.

జామపండ్లలో పీచు, విటమిన్-ఎ, విటమిన్-సి, ఫోలిక్ ఆమ్లాల శాతం చాలా ఎక్కువ. పోటాషియం, కాపర్, మాంగనీస్ వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయ్. అంతేకాదు, ఓ కమలాపండులో దొరికే సి-విటమిన్‌తో పోలిస్తే ఓ జాంపండులో దొరికే సి-విటమన్ శాతం నాలుగు రెట్లు ఎక్కువ. థాయ్ మెరూన్ రకం జాంపండ్లలో కెరోటినాయెడ్లూ, పాలీఫినాల్స్ శాతం ఎక్కువ. వీటి కారణంగానే ఈ పండ్ల చర్మం, గుజ్జు కూడా ఎర్రగా ఉంటాయి. మామూలుగానే జామలో యాంటీ ఆక్సిడెంట్లలోకెల్లా కీలకమైన పాలీఫినాల్స్ పుష్కలంగా దొరుకుతాయి.

భలేమందు!

పోషకభరితమైన జాంపండు అనేక వ్యాధులకు మంచి మందు కూడా. సాధారణంగా రోజుకో యాపిల్ తింటే వైద్యుడి దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదు అంటారు యూరోపియన్లు. సీజన్‌లో దొరికినంత కాలం జామ తింటే వైద్యుడి దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదంటారు.


* డయేరియా, డిసెంట్రీ, గ్యాస్ట్రో ఎంటరైటిస్.. వంటి వ్యాధుల్ని అరికట్టే గుణం జామకాయలూ, పండ్లలో ఉందట.
* మలబద్ధకానికి మంచి మందు జామ.
* జలుబూ దగ్గు ఉన్నప్పుడు పచ్చికాయల జ్యూస్‌గానీ జామ ఆకుల డికాక్షన్‌గానీ ఇస్తే త్వరగా తగ్గుతుందట.
* జామకాయలు, ఆకుల్లో ఉండే యాస్ట్రింజెంట్లు చర్మానికి మంచి టానిక్‌లా పనిచేస్తాయి. వీటిని తినడం వల్ల చర్మం మెరుపుని సంతరించుకుంటుంది. అలాగే జ్యూస్‌ని ఒంటికి పట్టిస్తే చర్మం శుభ్రపడి కాంతివంతంగా మెరుస్తుంది. పైగా వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల వృద్ధాప్య లక్షణాలు నెమ్మదిస్తాయి. ఈ కాయల్లోని పీచు కారణంగా కొలెస్ట్రాల్, బీపీ తగ్గుతాయి. బరువు తగ్గడానికి జామ దోహపడుతుంది. ఇందులోని కార్బోహైడ్రేట్లు జీర్ణం కావడానికి సమయం పడుతుంది. దాంతో పొట్ట త్వరగా నిండిపోతుంది. ఆకలి వేయడానికీ సమయం పడుతుంది.
* రోజూ ఓ దోర జాంపండు తింటే డయాబెటీస్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చు. మన రాష్ట్రంలోని మెదక్‌జిల్లాలోని కోహీర్ సఫేదా జాంపండ్ల రుచికి మరేవీ సాటి రావట. పసుపురంగు తొక్కతో తెల్లని గుజ్జుతో ఉండే సర్దార్ జామ కూడా తియ్యగా రుచిగానే ఉంటాయి. యాపిల్ జామ ఎక్కువగా మీడియం సైజులో తెలుపు, లేత గులాబీ రంగు లేదా ఎర్రని గుజ్జుతో తియ్యగా ఉంటాయి. త్వరగా పాడవవు. అందుకే చాలా ప్రాంతాల్లో వీటినే పెంచుతుంటారు. హఫ్షిరకం ఎర్రని గుజ్జుతో ఉంటాయి. బీహార్‌లో ఎక్కువగా పండే ఈ రకం పలుచని తొక్కతో ఉంటాయి.

పోషకాలెన్నో...

సుమారు 150 గ్రా. సాధారణ జామకాయలో క్యాలరీలు 110, తేమ 130 గ్రా, పీచు 8.8 గ్రా. కొవ్వులు 1.5 గ్రా, పిండిపదార్థాలు 23.5, కాల్షియం 30 మిగ్రా, ఫాస్పరస్ 65 మి.గ్రా, ఐరన్ 0.4 గ్రా, కాపర్ 0.4గ్రా, పోటాషియం 688 మి.గ్రా, విటమిన్-ఎ 1030 మై.యూ, విటమిన్-సి 377 మి.గ్రా, నియాసిన్ 1.8 మి.గ్రా ఉంటాయి.

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225



శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

98 పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

17. యస్య నాహఙ్కృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే
హత్వా2పి స ఇమాంల్లోకా న్న హన్తి న నిబధ్యతే.

వ్యాఖ్య : అహంకారముగాని, నేను కర్తనను తలంపుగాని లేనివానికి, బుద్ధి విషయము లందుగాని, కర్మలందుగాని, అంటని వానికి ఈ ప్రాణులన్నిటిని వధించినను, వధించ నట్లేయనియు, పాపముచే నతడు చుట్టుకొనబడననియు, అతడు బంధింపబడననియు ఇచట తెలుపబడెను. ఈ శ్లోకార్థమును బహుజాగ్రత్తగ యోచనచేయవలయును. లేకున్న మనుజుడు అజ్ఞానమను అఖాతమున పడిపోవు ప్రమాదము గలదు.

కర్మబంధమునకు కారణము కర్మలందు కర్తృత్వబుద్ధి గలిగియుండుట, బుద్ధి ఆ యా విషయములకు, కర్మలకు అంటుకొనుట (సంగము) అయియున్నది. కర్తృత్వబుద్ధి లేకుండ కర్మలు చేయువానికిగాని, విషయములందు బుద్ధి అంటకుండ (సంగము లేకుండుట) కర్మలు చేయువానికిగాని, ఆ కర్మజనిత సుఖదుఃఖములుగాని పుణ్యపాపములుగాని అంటవు. ఆ సత్యమే యిచట చెప్పబడినది. అంతియేకాని ప్రాణులను చంపుమనిగాని, చంపుట యుక్తమనిగాని యిచట బోధింపబడలేదు. పైగా సమస్తమును ఆత్మరూపముగ వీక్షించువాడు, కర్తృత్వములేనివాడు, అసంగుడై యుండువాడు, తాను మనస్సుగాదని తలంచువాడు, ఆత్మయందే స్థితిగలిగి యుండును గావున అట్టివాడు సమస్త ప్రాణులందును తన ఆత్మనే చూచుటవలన ఒక ప్రాణి కెట్లు బాధకలుగజేయగలడు? కాబట్టి అట్టి అసంగభావము గలవాడు, ఆత్మస్థితుడు జనులకుపకారము చేయునేకాని, అపకారము చేయడు. ప్రాణులను హింసింపడు. ఒకవేళ హింసించినచో అతని కింకను ఆత్మజ్ఞానము కలుగలేదనియే ఊహించవలసియుండును.

మనుజుడు వాస్తవముగ దేహముగాని, మనస్సుగాని కాదు; ఆత్మయే. కర్తృత్వము, అహంభావము లేనివాడు ఆత్మయందే స్థితి గల్గియుండును. అట్టివారు బుద్ధిచేగావింపబడు కర్మలతోగాని, తజ్జనిత బంధముతోగాని ఏ సంబంధమును లేకుండును. కాబట్టి యతడు ఒక ప్రాణినేకాదు, అన్ని ప్రాణులను ఒకవేళ చంపినను, బుద్ధితో సంగము లేకుండట వలన, కర్తృత్వము లేకుండుటవలన, ఆత్మయందే యుండుటవలన అతడు చంపనట్లేయగుచున్నాడు. మఱియు ఆ వధవలన కలుగుపాపముచే, బంధముచే అంటబడకనుండుచున్నాడు. ఇచట ఆత్మయొక్క, ఆత్మస్థితునియొక్క నిర్లేపత్వమును గూర్చిన ఒకానొక సిద్ధాంతము, సత్యము చెప్పబడినదేకాని హింసాప్రేరణము కాదు. వాస్తవముగ అట్టి నిర్లేపత్వమును బడసినవాడు, ఆత్మయందున్నవాడు నిరంతరము ప్రాణికోట్లకు మేలుచేయునే కాని, వానినేమాత్రము బాధింపడు. ఈ విషయమును ముముక్షువులు ముఖ్యముగ జ్ఞప్తియందుంచుకొనవలెను.

పుణ్యపాపములకు కారణము కర్తృత్వము, సంగము, ఆసక్తి; అనగా జీవుడు తన ఆత్మస్థానమును వదలి, దిగివచ్చి దృశ్యముతో, బుద్ధితోజేరి 'నేను చేయుచున్నాను' అని తలంచుటయే, కాని యెపు డట్టి సంగము (ఆసక్తి), కర్తకృత్వములేదో అత్తఱి ఆ పుణ్యపాపములతోగాని, తజ్జనితసుఖదుఃఖములచే గాని, బంధమోక్షములతోగాని మనుజునకు సంబంధముండదు. కావుననే అట్టివాడు అందఱిని చంపినను చంపనివాడే యని చెప్పబడుటకు కారణము. 'ఎంతపాపమైనను అంటదు' - అనుదానికి ఒక తార్కాణముగ, 'అతడొకవేళ అందఱిని చంపినను చంపనివాడేయగునని' వచింపబడినదే కాని వారిని చంపుమని బోధింబడలేదు.

మఱియు అర్జునుడు క్షత్రియుడు. దుష్టశిక్షణ ప్రభువుకు ధర్మము, కర్తవ్యము. కౌరవులు అధర్మమునుజేబట్టి దుష్టులుగ తయారైరి. 'కావున అట్టివారినందఱిని ఓ అర్జునా! అసంగబుద్ధిగల్గి, నిరహంకారముతో నీవు వధించినను వధింపనట్లేయగు' నని భగవానుడు అర్జుననకు తెలియజేయుచున్నాడనియు భావించవచ్చును. బుద్ధిని దాటి, అహంభావమునుదాటి ఆత్మయందు నెలకొనియుండువానికి ఆ బుద్ధితో ఏది చేసినను చేయనట్లేయగునుగదా! అయితే అట్టి స్థితియందుండువాడు అసభ్యమైన అధర్మయుతమైన, హింసాకరమైన, పీడాకరమైన క్రియలెవ్వియును జేయరు. 'ఇమాన్ లోకాన్' అని అర్జుననునకు చెప్పినందువలన 'ఈ యెదుటనున్న కౌరవరాజులు మున్నుగువారు' అనియు తలంచవచ్చును. ప్రభువులు దుష్టులకు, ద్రోహులకు గావించు శిక్ష పాపముగా పరిగణింపబడదు. కావు అది వారిని బంధింపదు. పైగా అట్టి క్రియను అసంగబుద్ధితో నాచరించునపుడు ఇంకను ఏ మాత్రము బంధప్రభావమును కలుగజేయదు.

కాబట్టి భగవానుడు తెలిపిన ఈ శ్లోకమందలి భావమును చాల లోతుగా విచారించి, పరప్రాణికి ఏమియు బాధ కలుగజేయక, ఆత్మయందు స్థితుడై అసంగబుద్ధితో ఆయా కార్యముల నెరవేర్చుచు, బంధవిముక్తుడై వెలయవలెను.

18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా
కరణం కర్త కర్తేతి త్రివిధః కర్మసఙ్గ్రహః

19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణ భేదతః
ప్రోచ్యతే గుణసఙ్ఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి

20. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్

వ్యాఖ్య : అజ్ఞానుల దృష్టికి (స్థూలదృష్టికి భౌతికనేత్రమునకు) ఈ ప్రపంచము, సమస్తపదార్థములు, సమస్త ప్రాణులు, విభజింపబడియున్నట్లు, వేఱువేఱుగానున్నట్లు కానుపించును. కాని జ్ఞానుల దృష్టికి అంతయు అవిభక్తముగను, సర్వత్ర నేఆశనరహితమగు ఒకే ఆత్మవస్తువు (పరబ్రహ్మము) వ్యాపించియున్నట్లును గోచరించును. ఏ జ్ఞానముచే అట్టి అవిభక్తము వారికి అనుభూతమగుచో అట్టి జ్ఞానము సాత్త్వికమైనది యిచట పేర్కొనబడెను.

'సర్వభూతేషు'- అని చెప్పినందువలన భగవంతుడు (ఆత్మ) సమస్తచరాచర ప్రాణికోట్లయందును వ్యాపించియున్నాడని తెలియుచున్నది. కావున ఎట్టి నికృష్టజీవి అయినప్పటికిని, తనవెనుకనున్న పరమాత్మను తెలిసికొని, తన యథార్థరూపమును అవగతమొనర్చుకొని తరించుటకు అవకాశము కలదు. తరంగము చిన్నదైనను దాని కాధారభూతమైన సముద్రమును భావించి దానిలో లీనమగుటకు, సముద్ర రూపముగటులకు అద్దానికి హక్కుగలదు. కావు ఎట్టి అల్పవ్యక్తి అయినప్పటికిని ఎవరును ఇక అధైర్యపడవలసిన పనిలేదు. హృదయమును పవిత్రమొనర్చుకొని తన నిజరూపమగు ఆత్మను తెలిసికొనిన చాలును తరించిపోవును.

(తరువాయి వచ్చే సంచికలో)



శ్రీలంకలోని కండి (కాండీ)కి బౌద్ధాన్ని తీసుకొచ్చిన తెలుగువారి విగ్రహం

శ్రీలంకలో మన తెలుగువాళ్లు

శ్రీలంక అనగానే సింహళులు, తమిళులు మాత్రమే గుర్తుకొస్తారు. ఏ రికార్డులకెక్కని ఎనిమిదిన్నర లక్షలమంది తెలుగువాళ్లు ఉన్నారక్కడ. వారిలో కొందరు పాములు కోతులు ఆడించే అహికుంటకల జాతిగా... 'జిప్సీ'లుగా బతుకుతున్నారు. శ్రీలంక మూలవాసులు వారు మాట్లాడుతున్న భాష పేరు 'తెలుగు' అని వాళ్ళకి పాతికేళ్ల కిందటి వరకూ తెలీదు. ఆ భాషకి లిపి ఉంటుందనే సంగతి కూడా వాళ్ళకు నిన్న మొన్నటి దాకా తెలీదు. తెలుగు భాష, తెలుగు అక్షరం కోసం అక్కడివారు పరితపిస్తున్నారు. వారి ఆరాటానికి ఆసరాను ఇచ్చేందుకు 'అక్షరాన్ని' తీసుకుని ఒక బృందం 'తెలుగులంక'లో ప్రయాణించింది. ఆ బృంద సభ్యుడు ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు తెలుసుకునొచ్చిన విశేషాలే కొన్నిక్కడ తెలియజేస్తున్నాం.

శ్రీలంకలో పాములు, కోతులు ఆడించేవాళ్లు తెలుగు మాట్లాడతారంట అని ఆయన తన విద్యార్థులకి చెప్పారు. లంకలో ఎక్కడైనా పాములు ఆడించేవాళ్ళు కనిపిస్తే పలకరించు, తెలుగు మాట్లాడతారేమో చూడు అని సుబ్బారెడ్డికి రమేశ్ చెప్పాడు. ఒక రోజు ఆట, ఒక రోజు విరామంగా మ్యాచ్ సాగుతుండటంతో అనేక పర్యాటక ప్రదేశాలు చూసే అవకాశం సుబ్బారెడ్డికి దొరికింది. సీగిరియా కొండ ఎక్కుతుండగా పాములాడించే మనిషి కనిపించాడు. పలకరిస్తే తెలుగు మాటలు వినిపించాయి. ఊరు ఊరంతా తెలుగువాళ్ళే తాను తెలుగువాడినని తెలుగు నేల నుంచి వచ్చానని చెబితే వాళ్ళంతా పొంగిపోయారు. స.వెం. రమేశ్ శ్రీలంక వెళ్ళారు. పాములు, కోతులు ఆడించేవాళ్ళ ఊళ్ళన్నీ తిరిగాడు. పందలాందిమందితో మాట్లాడాడు. పిల్లలకి తెలుగులో వాళ్ళ పేర్లు రాసుకోవడం నేర్పించాడు. తమ మాటకి అక్షరం ఉందని తెలిసినపుడు వాళ్లు ఆనందం అంతా ఇంతా కాదు. తమకు తెలుగు రాయడం, చదవడం నేర్పించమని కోరారు. ఇండియా తిరిగి వచ్చాక ఇంటర్నెట్ సాయంతో సింహం (వాళ్ళు ఇలాగే అంటారు) అక్షరాలు డౌన్‌లోడ్ చేసుకుని నేర్చుకున్నారు. వాళ్లు దేవుని ప్రసాదంలా వాటిని అందుకున్న తీరు తెలుగు అక్షరం పట్ల వాళ్ల ఆరాటాన్ని తెలియజేసింది.

'లంక తెలుగువారిది'

"విజయబాహు ఎవరు? కువేణి ఎవరు? కండి (కాండీ) రాణి ఎంగటరంగమ్మ ఎవరు? సిరిమావో బండారు నాయకె ఎవరు? చంద్రికా కుమారతుంగ ఎవరు? అందరూ తెలుగువాండ్లే. లంక దేశం మాది అని సింగలవారూ, కాదు మాదీ అని తమిళవారు కొట్టుకుంటారు. నిజం మాటాడితే ఈ ఇద్దరిదీ కాదు. లంక మన తెలుగువారిది. హిస్టరీలో చెప్పుండేది అదే. ఈ నేల మీద ఆది నుండీ ఉండేది తెలుంగు మాట్లాడే మనిషే. అయినా ఈడ తెలుంగు అకరు (అక్షరం) లేకుండా పోయింది. తెలుంగు జాతి పేరు రికార్డుల్లో లేదు. మేం మా ఇల్లులో మాటాడేది తెలుంగే. మా తెలుంగు బోమంచి తెలుంగు. కానీ మా పుట్టిక సర్టిఫికెట్లలో దా లంక దెమ (తమిళం) అని రాసి ఉంటారు. ఇది తప్పు అని అడిగే యోచన గూడా మాకు లేదు. పెద్ద చదువులు చదివిన వాళ్ళు దా వాండ్ల పనుల కోసం, వాండ్ల యాపారాల కోసరం తెలుంగు అని చెప్పేలేదు. ఇల్లులో తప్ప వెలప తెలుంగు మాటాడేది లేదు. అందురూ మమ్మల్ని చూసి వీడు జిప్సీ. వీడు జిప్సీ అంటారు. ఎవరు జిప్సీ..? ఈ నేల మిందనే పుట్టి, ఈ అడివిల్లోనే పెరగతా ఉండే మేము జిప్సీలము ఎట్లయితాము? బుద్ధ ఆగమనం (మతం) ఈ దేశంలో అడుగుపెట్టే కాలానికే మేము దా ఈడ ఉండామని హిస్టరీల ఉంది. చదువకోండి. నిజమైన లంకవాసులం మేమే లంక మాదే"

ఒక జలపాతం లాగా మాటలతో మమ్మల్ని ముంచెత్తి పోసిన అతని పేరు అల్ఫాన్సో. శ్రీలంక తూర్పు ప్రాంతంలోని బట్టికలోవ దగ్గర అలిగంబె అతని ఊరు. అలిగంబెని వాళ్ళు అచ్చ తెలుగులో ఏనిగల ఊరు అని పిలుచుకుంటారు. అల్ఫాన్సో ఐక్యరాజ్య సమితికి సంబంధించిన ఒక విభాగంలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఇండియాలో తెలుగునేల మీద నుంచి వచ్చామని తెలుసుకుని మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి కలుసుకున్న అతడి గొంతులో ఉద్వేగం మాటల్లో ఉద్రేకం మాకు పెదవి విప్పే అవకాశం ఇవ్వకుండా విరుచుకుపడ్డ అతను ఒక గంట తర్వా త నెమ్మదించి మా ముఖాల్లోకి తరచి చూశాడు. ఏదో వెతుకుతున్నట్టుగా. కొన్ని క్షణాల నిశ్శబ్దం. అల్ఫాన్సో మాట వెనుక పేరుకున్న దుఃఖం బద్దలైన శబ్దమే ఆ నిశ్శబ్దం. అది అతడొక్కడిదే కాదు. శ్రీలంక నేలమీద తమిళ, సింహ తెరల మాటలను దాగుడుమూతలాడుతూ బతుకుతున్న ఎనిమిదిన్నర లక్షల తెలుగు ప్రజలది. ఇంకా మాట్లాడితే, ఆ గొంతు శ్రీలంక తెలుగువారిది మాత్రమే కాదు. భాష పేరుతో రాజకీయ గీతలు గీశాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిసా రాష్ట్రాల్లో ఉండిపోయిన ఎనిమిదిన్నర కోట్ల తెలుగువారిది కూడా. ఆంధ్ర అనో, తెలంగాణా అనో మనకు మనమే గీసుకున్న గిరుల్లో మాత్రమే మన భాష లోతుల్నీ, మన సంస్కృతి మూలాల్నీ వెతుక్కోవడంలో అర్థంపర్థం లేదనీ సంగతి గీతలకవతల ఉన్న తెలుగువారిని కలిస్తేనే తెలిసివస్తుంది. అల్ఫాన్సో వంటివారి మాటల తీవ్రతలో ఉద్వేగం శ్రుతిమించి అతిశయోక్తికి అవకాశం ఉండవచ్చుగానీ, అబద్ధానికి తావులేదు.

అకుర్ల పొత్తాలు పంపరాదా!

'మన మాసిలు (మనుషులు) దా బో బెద్ద గుంపు గదా...ఏల దెమల (తమిళం) మాటాడవలె? ఏల సింగల మాటాలడవల. మనమాట మనకు కావల. మన బిల్లోల్లు (పిల్లోళ్ళు) మన మాట నేర్వవల. మన అకుర్లు (అక్షరాలు) మనకు ఉండెనని ఇప్పుడే గదా తెలిసె... మన అకుర్ల పొత్తాలు (పుస్తకాలు) అంపితే బిల్లోల్లు నేర్వరా... సెప్పు అన్నా?'

-అమాయకంగా, ఆత్మీయంగా లీలావతి అన్న మాట ఇది. లీలావతి మసెన్న భార్య. మసెన్న చేసే పని పాములు పట్టి ఆడించడం. మధ్య లంకలోనూ, ఉత్తర లంకలోనూ, వాయవ్య ప్రాంతంలోనూ మసెన్న మాదిరిగా పాములు పట్టి ఆడించేవాళ్ళు చాలామంది ఉన్నారు. వీళ్ళంతా లీలావతి మాట్లాడిన మాదిరి తెలుగే మాట్లాడతారు. వాళ్ళ ఊళ్ల పేర్లు దీవరగమ, అంతరపెద్ద, నొచ్చికుళం, అళిగంబె, శ్రీవల్లిపురం, చీమలగన్న, కాంచనపుర. వీరిలో రెండు తెగలున్నాయి. అవి దుగిడోరు, తేపలోరు. శ్రీలంకలో కోతులు పట్టి ఆడించేవాళ్ళు కూడా తెలుగే మాట్లాడతారు. వీళ్ళని గుల్వోరు అంటారు. తంబలగమ, పనయడి, సమగిమావత, కిరాన్‌కుళం,



ఈ అహికుంటకలు తెలుగువారే



పాములోళ్ళ బొమ్మ

పేలియగొడ, వలత్తాపిట్టి, ఊరకుడవత్త, పొత్తువర, మహాశక్తిపురం, తెలుగునగర్. చీమలగన్నలో రెండు తెగలవాళ్ళు ఉన్నారు. అయితే ఈ రెండు తెగల మధ్యా కంచం పొత్తూ, మంచం పొత్తూ లేవు. ఈ రెండు సంచార జాతులనూ కలిపి శ్రీలంకలో అహికుంటకలు అంటారు. అహి అంటే సింహల భాషలో పాము అని అర్థం. కుంటక అంటే భిక్షువు. వీళ్ళ ఆడవాళ్ళు చేతులు చూసి జోస్యం చెబుతారు. గుడ్డ జోలెలో బిడ్డను పడుకోబెట్టుకుని గాడిదల మీద తట్టాబుట్టా వేసుకుని ఊళ్ళు తిరుగుతూ పాములు, కోతులూ ఆడించకుకుంటూ బతికే మనుషులు.

శ్రీలంక పర్యాటకం పెరిగిపోయాక, నగరాల్లో గుడారాలు వేసుకోవడానికి వీళ్లకి తావు దొరకడం కష్టమైపోయింది. అందువల్ల పది, పదిహేనేళ్ళుగా వీళ్ళు తావులు మార్చకుండా బతికే పద్ధతికి అలవాటుపడుతున్నారు. శ్రీలంక ప్రభుత్వం వీళ్ళకు ఇళ్ళ స్థలాలు ఇచ్చింది. కొందరికి వ్యవసాయ భూములు ఇచ్చింది. విచిత్రమైన సంగతి ఏమిటంటే, తాము మాట్లాడుతున్న భాషపేరు వీళ్లకి పాతికేళ్ల కిందటి దాకా తెలీదు. 'మనమాట' అనేవాళ్ళంతే. సంచార జాతుల మీద శ్రీలంకలో జరిగిన పరిశోధనల్లో అతి తెలుగని తేలాక, వాళ్ళకి తెలుగు అనే మాట పరిచయం అయింది. దానిని తెలుంగు అని పలుకుతారు. అయితే తెలుంగు భాషకి లిపి ఉంటుందనే సంగతి వాళ్ళకు నిన్న మొన్నటి దాకా కూడా తెలీదు. సంచార జీవనం తగ్గిపోయి రకరాల పనుల్లో కుదురుకుంటున్న అహికుంటకల పిల్లలు ఇప్పుడిప్పుడే బడులకు పోతున్నారు. తెలుగు అకుర్లు నేర్చుకోవాలని ఈ జాతుల్లోని పెద్దలూ, పిల్లలు తెగ ఆరాటపడుతున్నారు.

శ్రీలంకలో నివసించే తెలుగువాళ్ళలో ఎక్కువ మందికి తెలుగు మాట్లాడడం రాదు. వారిలో ఎక్కువ మంది బ్రిటీషుపాలనా కాలంలో (1802 తర్వాత) దక్షిణ భారతదేశంలోని చోళ పాండ్య మండలాల (ఇప్పటి దక్షిణ తమిళనాడు) నుంచి శ్రీలంకకు చేరుకున్నవారే. టీ. కాఫీ తోటల్లో పనుల కోసం బ్రిటీషు పాలకులు వీరిని తరలించారు. తంజావూరు, తిరుచురాపల్లి, రామనాధపురం, మదురై ప్రాంతాలలో నివసించే రెడ్డి, నాయుడు, మాదిగ, కోమటి, వడ్డెర, కుమ్మరి, కంసాలి, కంబలత్త నాయకర్ (యాదవుల్లో ఒక తెగ) మొదలైన కులాలవాళ్ళే అక్కడికి ఎక్కువగా వలసపోయారు. మద్రాసు నుంచి ఆంధ్ర విడిపోయాక ఇప్పటి తమిళనాడులోని తెలుగువారిలాగే శ్రీలంకలోని తెలుగువారూ తమిళ కవచం కింద ఒదిగిపోయారు. మూల నేలతో ఇప్పటికీ ఎంతో కొంత సంబంధాల్లోనే ఉన్నా తెలుగును మాత్రం దాదాపుగా కోల్పోయారు. తమిళమే చదువుకుంటున్నారు. తమిళమే మాట్లాడుతున్నారు.

తెలుగు వ్యాపారస్తులెందరో!

కొళంబు నగరంలో అడుగుపెడితే చెన్నయ్‌లో ఉన్నట్టే ఉంటుంది. బోర్డులూ, మాటలు అన్నీ తమిళమే. బంగారం, బట్టలు, హోటలు వ్యాపారాల్లో ఇప్పటికీ సింహళుల పాత్ర నామమాత్రం. పైకి తమిళులుగా కనిపించే ఈ పెద్ద వ్యాపారుల్లో నిజానికి ఎక్కువమంది తెలుగువారే. శ్రీలంకలో బంగారం ధరను రోజూ నిర్ణయించే స్థాయిలో ఉన్న దేవీ జ్యువెలర్స్ తెలుగువారిదే. 'మా అమ్మా, ఆడవాళ్ళూ ఇప్పటికీ తెలుగే మాట్లాడతారు. నాకు కొంచెం కొంచెం మట్టే వచ్చును. మా బిడ్డలకి తాయిముళి (తల్లిభాష) కొంచెం కూడా రాదు' అని దేవీ జ్యువెలర్స్ యజమాని వాసు చెప్పారు. రెడ్డియార్‌ల సంఘం నాయకుడు, మరో బంగారు నగల వ్యాపారి మహేశ్‌కి కూడా అంతే. తెలుగు మాటలు ఒకటి రెండు తప్పరావు. ఆయన ఇంటికి వెళ్ళాం. వాళ్ళ నాయనా, ఆడవాళ్ళు మాత్రం తెలుగు మాట్లాడుతున్నారు. కొళంబు నగరం స్ట్రీట్‌లో తిరుగుతున్నప్పుడు అన్నపూర్ణ హోటల్ అనే బోర్డు చూసి లోపలికి వెళ్ళి పలకరించాం. వాళ్ళు తెలుగువాళ్ళే. తమిళనాడులోని తిరుచ్చి ప్రాంతం నుంచి వలసవచ్చినవాళ్ళు తెలుగు మాట్లాడడం రాదు. ఇండియా నుంచి తెలుగువాళ్ళం వచ్చామని చెబితే చకచకా కొందరిని పోగేశారు. వాళ్ళలో రామజయం, మురళి, జానకిరాంలని కదలిస్తే 'అమ్మ నాయనల తరం వరకే తెలుగు మాట్లాడం. ఇళ్ళల్లో కార్యాల్లో ఒకప్పుడు తెలుగు పాటలు పాడుకునేవాళ్ళం. ఇప్పుడు తెలుగు ఎవురికీ తెలీదు. పిల్లలకి తెలీకూడదనుకున్నప్పుడు మాత్రమే సంకేత భాషగా తెలుగులో మాట్లాడుకుంటాం' అని మురళి చెప్పారు. తల్లి భాషను కోల్పోతున్నామనే బాధ వాళ్ళ గొంతుల్లో ధ్వనించినా, తిరిగి కాపాడుకోవాలనే కోరిక మాత్రం కనిపించలేదు. 'మేం ఇండియా వచ్చినా మా ప్రాంతాల (ఇప్పటి తమిళనాడు)కే పొయ్యి వస్తుంటాం. ఆంధ్రాకి వచ్చే పనే మాకు లేదు. ఇంక తెలుగుతో పని ఏముంది?' అనేది వాళ్ళ ప్రశ్న. భాష భావోద్వేగాలకే పరిమితమైనది కాదు. అది బతుకుతో ముడిపడ్డ అంశం. అందుకే లంకలోని తమిళ ప్రజల సంఖ్యలో సగానికన్నా ఎక్కువే ఉన్నా తమిళ గొడుగుకింద తెలుగువాళ్ళు 'భద్రంగా' ఉండిపోయారు. తమిళుల పోరాటం ఫలాలను నిశ్శబ్దంగా అందుకున్నారు. పుట్టుక సర్టిఫికెట్లలో 'ఇండియ తమిళ' అనో 'లంక తమిళ' అనో రాయించుకున్నారు. తెలుగు అవసరం వాళ్ళకు విడిగా కనిపించలేదు.

ఇప్పుడిప్పుడే బయటికొస్తున్నారు

అయితే తరాలు మారేకొద్దీ తెలుగుభాష ఇళ్ళలోంచి మాయమయిపోతుండటంతో కొందరు కలవరపడుతున్నారు. ఈ ఆందోళన సంపన్న తెలుగు కుటుంబాలకన్నా, పేద, మధ్యతరగతిలో ఎక్కువగా ఉంది. కొళంబు నగరంలోని బేస్‌లైన్ ప్రాంతంలో కోపియవత్త అనే మురికివాడ ఉంది. ఆటో నడుపుకునే మాణిక్యం నివాసం అక్కడే. లంకలోని తెలుగువాళ్ళంతా ఒక్కటి కావాలన్నది ఆయన ఆశ. మా గురించి తెలుసుకుని తన ఇంటికి పిలిచాడు. ఇంకా కొందరు తెలుగువాళ్ళని పోగేశాడు. మేం తిరిగి విమానం ఎక్కేదాకా మా యోగక్షేమాలను ఫోన్‌లలో మాట్లాడుతూనే ఉన్నారు. ప్రవాసాంధ్రుల్లో తెలుగుపై ఆసక్తి కలవారెందరో ఉన్నారు. ●

పల్నాటి సోదరకవులు వీర శౌర్య సౌందర్య సుగంధం

అంకురింపవు మోమునం దదురు కళలు
అటునిటు చెలింపబోవు నిజాంగకములు
తన యురస్థలి విడలేదు ధైర్యలక్ష్మి
యుద్ధమున కేగునపుడా సుయోధనునకు

అని,

ఒక్కని జంపుట కిందరు
గ్రక్కున వచ్చితిరి సిగ్గుగాదా? యిది మీ
రొక్కక్కరు వచ్చి చూచిన
యిక్కడ మీ గతులు మీకే యెరుకగునుగదా

–అనుటలో యుద్ధభూమిలో నిలిచి చైనీయుల నెదిరించెడి భారతీయుడు తలపుకు వస్తాడు. చిన్ని చిన్ని మాటల్లో చిలకపలుకల్లా తెలియజేసారు.

పలనాటి వీరచరిత్రము, నవభారతము వీరు వ్రాసిన చారిత్రక గ్రంథాలు. పలనాటి వీర భారతాన్ని గూర్చి పలనాటి వీరచరిత్రము, అరవై సంవత్సరాల (1947 నాటికి) కాంగ్రెసు మహోద్యమ చరిత్ర నవభారతముగా పొందుపరచారు. ఈ చారిత్రక గ్రంథానికి నేపథ్యముగా చారిత్రక విశేషాలను రసరమ్యంగా హృద్యంగా, సత్యసుందరంగా కవిగారు చిత్రీకరించారు.

మాయకులమత శాఖాభిమానములకు
మంత్ర తంత్ర రహస్య సన్మానములకు
సంఘవిద్రోహకర దురాచారములకు
తావులేదన్న! బౌద్ధ సిద్ధాంతమందు

రణమునం దాగలేక యోరంగపజేబు
రాజబిరుదమునొప్పి శివాజితోడ
సంధి కొడంబడి సిగ్గున సైన్యములను
కోటకుంజేర్చుకొనె నాటి పోటుమాని

వంటి పద్యాలలో భారతీయుల వీరశౌర్య సౌందర్యం గుప్పున గుభాళిస్తుంది.

సాంఘిక విభాగానికి చెందిన కయిమొర, పేదరాలు, పేదకాపు, ఆపన్న, విశ్వవిపంచి, నందికొండ, రాచిలుక, బాటసారి, లోకబాంధవులు రచనలు పేర్కొనదగి ఉన్నాయి. సాంఘిక కృతులలో దేనికదే అగ్రభాగాన నిలవటం విశేషం!

అలసిపోయినె తెలుగు
సొమ్మసిల్లినె తెలుగు
తిట్టినె తెలుగు
కొట్టినె తెలుగు
ఏడిచినె తెలుగు
ఏడిపించినె తెలుగు
తెలుగులో ఆటాడి, పాటపాడి, తిట్టుకుని, అసహ్యించుకుని,
అరుచుకుని, కరుచుకుని, కసురుకుని -
తుమ్మినె తెలుగు - శ్రీరామరక్ష నూరేళ్ళు ఆయుష్షు
దగ్గినె తెలుగు - శ్రీరామ తండ్రి కాపాడరె
ఉలిమినె, మెలిసినె తెలుగు - అర్ఘినె ఫల్గుణ
భయమేస్తె తెలుగు - ఉపశ్రీ వెలి సుందరకాండ
కోపమొస్తే తెలుగు - జుంధ్యాలవెలి తిట్టు
అన్నీ అయ్యాక ఆకలేస్తే తెలుగు అట్టు - పెసరట్టు

ప్రబోధాత్మకమైన ప్రభులింగాచార్యులు వారి అముద్రిత రచనలైన ఆంధ్రసోదరా! చినలింగాచార్యుల గారి కయిమొర, సూరత, జ్యోతిషులు ఆర్తనినాదం వీరభద్రాచార్యులుగారి విశ్వవిపంచి, పేదరాలు, బాటసారి. లోకబాంధవులు, కన్నెగోవు, తెలుగుపాప మొదలైనవి సోదరకవుల లేఖిని నుండి వెలువడిన సాంఘిక కావ్యాలు. సాంఘిక కృతుల రచనలలో ప్రభులింగాచార్యులు గారి కంటే చినలింగాచార్యులు. చినలింగాచార్యులుగారి కంటే వీరభద్రాచార్యులు గారు రాణించారు. వీరభద్రచార్యులుగారు ఈ ముగ్గురిలోనే కాక తెలుగు కవులలో విశిష్టునిగా భాసించారు. సంఘ ప్రయోజనానికి తనకుతాను అంకితం చేసుకున్న తపస్వి, మహాతపస్వి వీరభద్రాచార్యులుగారు. అందువలననే కాబోలు వీరిని కాటూరి వారు కవిమహర్షియని సంబోధించారు జాషువా కవివరేణ్యులు.

అగ్రకవులము మేమటం చర్రులెత్తి
కేకలన్ వైచెదము గాక మాకు లేని
ఒక తపఃకళ యతని యందుండు కతన
సాటి కాబోము మేము పల్నాటి కవికి

అని మనస్సు ఉప్పొంగి చెప్పారు

ప్రభులింగాచార్యులు గారు వ్రాసిన ఋణపిశాచి, చినలింగాచార్యులుగారు వ్రాసిన

"అతనికి వానరంబుల మహాయుగముల్ నిముషంబులేండ్లు భూ
పతి చయదర్శనంబులు నభఃకుసుమ ప్రళయంబు లట్టి దు
స్థితి కాక దాసుడై కొలువు సేయుచు ప్రాయము బాయ లెట్టులో
బ్రతుకుచునుండె భూమిపయి ప్రాణములున్న శవంబు రీతిగా

ఆయనకొక్కసెంటు పొలమైననూ లేదల రుద్రభూమిలో
ఖాయము జేయగా, బడిన కాశ్యపి మూరల మేరుదప్ప ద
త్ర్పాయము రెండు పాతికల పైననె యెంతని యేరు సాయమున్
జేయుదు రక్కవీంద్రునకు జేయ సమర్థుడు దేవుడొక్కడే"

వంటి పద్యములలో వారి ఆర్థిక బాధలు వ్యక్తమౌతాయి. పేదరాలులో భరతమాత లక్షణాలు. ఆపన్నలో తెలంగాణా వారిపట్ల ఆంధ్రుల సోదరాభిమానం కనిపిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ సమస్యలను సముచితముగా సృజించిన యాకవులు

అల్లకల్లోలమై దేశమలమటించు
కాలమున నీవు పట్టు బంగారు కలము
ప్రజావాహిని దరియింప ప్రాకులాడె
నింతకంటెను ఘోరమింకేమి కలదు

అని వాపోయారు. రాయప్రోలు వారి తృణకంకణములోని ప్రేయసీ ప్రియులవలె కాక విశ్వవిపంచిలో అనురాగమూర్తులుగా వర్ణించారు. ●

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావు!

చక్కని రాజమార్గములుండగ సందుల దూరనేల' అంటూ 'రామభక్తి సామ్రాజ్యము'ను తన చుట్టూ నిర్మించుకున్న పరమభక్తాగ్రేసరుడు కాకర్ల త్యాగరాజుగారు మన తెలుగువాడని యెలా దర్పంగా చెప్పుకుంటున్నామో, అలా రామచంద్రుని కృపతో రామదర్శనం పొంది, రామాజ్ఞతో 'శ్రీమదాంధ్ర భాగవతం' రచనకు నడుము కట్టి– పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుంటడ, నే పలికిన భవహరమగునట' అంటూ రచనకు పూనుకుని మందార మకరంద మాధుర్య పదాలతో తెలుగుల హృదయాల్లో భక్తి యనే జ్ఞానజ్యోతిని వెలిగించిన బమ్మెర పోతన గారూ తెలుగు వాడేనని పదహారు కోట్ల మంది తెలుగువారూ గర్వపడాలి!

ఆ కోవలోని మరొక మహానుభావు డైన 'ఆంధ్ర వాల్మీకి'ని గురించి రసజ్ఞులైన ప్రముఖాంధ్ర పాఠక మహాశయులకు దుర్ముఖినామ సంవత్సరోదయ సందర్భంగా తెలియచేస్తున్నాం.

రామాయణ క్షీరసాగర మదనాన్ని చేసి రమారామ పీయూషాలను సంస్కృతంలో అఖిల భారత మాగాణంలో పండిస్తే, ఆ సుందర కావ్య మకరంద మాధుర్యాలను తొలిగా తెలుగు నేలపై పండించిన మహాకవివరేణ్యుడు, రామ భక్తాగ్రేసరుడైన ఆంధ్ర కవి ఆంధ్ర వాల్మీకి బిరుదాంకితుడైన వావిలికొలను సుబ్బారావుగారిని గురించి తెలుసుకోవలసిన అవసరమెంతో ఉన్నది.

రామభక్తి సామ్రాజ్యం ఏ మానవుల కబ్బెనో మనసా ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే మనసా' అని త్యాగరాజుల వారి మాటను అక్షర సత్యం కావించినవారు వావిలికొలను సుబ్బారావుగారు. పెక్కురు బక్కదేవతలను కొలిచెదరు– అట్లు కాదయా– కొలిచిన నిన్ను కొలువవలెనంటూ మ్రొక్కిన నీకు మ్రొక్కవలె, మోక్షమొసంగిన నీవు యీవలెన్' అంటూ రామదాసు వలె, అందరూ ఆంధ్ర వాల్మీకి రామాయణమును చదివి, రామభక్తుల్ని చేసిన ఘనతయు కూడా వావిలికొలను వారిదే!

ఆయన ప్రతీ గృహాంగణమునూ ఒక అయోధ్యగానూ, వాల్మీకి ఆశ్రమంగానూ, నైమిశారణ్య మందలి సూతుల ఆశ్రమంగానూ, తన పాద స్పర్శతో పావనం చేశారు.

రామాయణం సర్వసాధారణమైన కావ్యం కాదనీ, ఇరవై నాలుగు గాయత్రీ మంత్రాక్షరములతో నిబంధింపబడిన మంత్ర మంజూష వాల్మీక మనీ, మహానుభావులు, మహావిద్వాంసులూ భావించారు. ఆయన్ను వాసుదాసు అని పొగిడారు.

వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ, పారమ్యాన్నీ ఆంధ్ర వాల్మీకి రామాయణంలో ప్రోదిచేసి, ఆ మహద్గ్రంథ రామాయణాన్ని సుగంధ సౌరభజ్ఞాన గ్రంథాన్ని కావించారు కాబట్టే ఆయన్ను కవి కులం ప్రాతఃస్మరణీయునిగా తలచింది. ఆంధ్ర వాల్మీకి వాసుదాసు స్వామి అన్నది.

జనన మరణ రూపకమైన సంసార బంధంనుడి విముక్తిని కలిగించేది రామకథే! భగవత్ సాయుజ్యం పొందేటందుకే తాను రామాయణం రచన చేశానన్నారు. ఎన్నో రామాయణాలున్నాయి కదా మరల ఇదేల రామాయణం అనియని ఎవరైనా అంటే– ఎవరి పుణ్యం వారిది, ఒకరి పుణ్యం మరొకర్ని రక్షించదు' అనేవారు. అంతేకాదు వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా పలికినవారు పూర్వకవులందునూ, నేటి కవులందూ లేరు. నేటి రామాయణంలో మూలానుసారంగా ఉన్నది సమగ్రం కాదు. సమగ్రమైనది మూలానుసారం కాదు. తమ అభిప్రాయాలనూ, ఇతరుల అభిప్రాయాలనూ మూలముగా చేర్చి చెబితే అది వాల్మీకి పలికిన దెట్లవుతుంది' అని ప్రశ్నించేవారు.



సుబ్బారావుగారు పిన్నతనమునుండే పరమభక్తులైన రామభజనాపరులు. ఆంధ్రభాషలో అంతకు ముందు యథా మూలములు లేవనీ, అర్థపూర్తి కలిగి కావ్య, ఇతిహాస గౌరవ పాత్రమై, ప్రామాణికమై సర్వజన పఠనమైన మూలాను సారమైన రామాయణమును తెలుగులో ఉండడం లోకోపకార మౌతుందని భావించి రచించానని చెప్పారు. ఎనిమిదేండ్లలో ఈ రామాయణ రచనను ఆంధ్రీకరించి, కడప మండలంలో గల ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేయడం తన సుకృతమన్నారాయన. సుబ్బారావుగారు జీవించి ఉండగానే ఆంధ్ర రామాయణం నాలుగు ముద్రణలు జరిగింది.

ఆయన పలుమారులు రామునిపై గల గాఢ విశ్వాసాన్ని సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి, వాతాత్మజ సౌమిత్రివైనతేయ రిపుమద్దరనతాత భారతాదులు సోదరులు మాకు' అనే విశ్వాసాన్ని భక్తి ప్రపత్తుల్ని ప్రకటించారు.

ఆంధ్ర వాల్మీకి రామాయణ రచనా కాలం 1900 – 1908 సంవత్సరాల మధ్య కాలంలో జరిగింది. గాయత్రీ రామ షడాక్షర మంత్రములో మూలంలో ఉన్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేశారు. వాల్మీకి రామాయణంలో ఉన్న బీజాక్షరము లన్నిటినీ ఇందులోనూ అదే స్థానంలో చేర్చి వ్రాశారు. ఆయన విడిగా గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి వ్రాశారు, ఆంధ్ర వాల్మీకం అనువాదమైనప్పటికినీ స్వంత రచన, స్వతంత్ర రచనగా ఖ్యాతి గాంచింది.

వీరికన్నా పూర్వకవులెల్లరూ వాల్మీకి రామాయణమును సంపూర్ణంగా తెనిగించిన దాఖలాలు లేవు. పూర్వ రామాయణమునూ ఉత్తర రామాయణమునూ తేట తెనుగులో తెనిగించిన ఖ్యాతి వీరొక్కరికే దక్కింది.

ఆంధ్ర వాల్మీకి సుబ్బారావు గారు రామాయణం బాలకాండంలో స్వవిషయంగా వ్రాస్తూ, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుని కుమారులైన కుశలవులు లోకానికి ప్రకటించినట్లే, తాను శ్రీరాముని తనయులు కుశలవుల వంటివాడినే యని, అలా తాను ఆంధ్రలోకానికి చెప్పడానికే శ్రీరామచరితమును చెప్పబూనానన్నారు. సంకల్పించడం తన వంతుయనీ, సంకల్పం నెరవేర్చడం శ్రీరామునివంతనీ, గ్రంథ రచనను పూర్తిచేసే భారాన్ని ఆయనపై మోపానని వ్రాశారు. తాను రోగియై ఒక కాలు వీట ఒకకాలు కాట ఉంచుకుని, ఏ రోజున ఏఁవి జరుగుతుందోనని బ్రతుకుపాటు నిశ్చయం లేనివానిగా కూర్చుని, వ్రాసి పూర్తిచేశానంటే అది శ్రీరామచంద్రుని కృపయే నన్నారు.

వావిలికొలను సుబ్బారావుగారి చరితంలోనికి వద్దాం- ఆయన భారద్వాజ గోత్రీకుడు, ఆపస్తంబ సూత్రుడూ, గోల్కొండ వ్యాపారి శాఖీయుడు, వావిలకొలను రామచంద్రరావు కనకమ్మల ముగ్గురు సంతానములోని మధ్యముడు. 1863 సం॥ములో జన్మించినవారు.

వీరి వంశపు గోల్కొండ వ్యాపారులందరూ విశిష్టాద్వైతులేనని, పంచ సంస్కారులైన నియోగులని ఆయన తన విషయంగా పేర్కొన్నారు. ఆయనగారి పదహారవ యేటనే తండ్రి రామచంద్రరావు మరణించడం, అన్ననూ, తమ్ముణ్ణీ, తల్లినీ, తననూ పినతండ్రి లక్ష్మణరావుగారు చేరదీసి, చదువు చెప్పించి పెద్దచేశారు, దురదృష్టవశాత్తు సుబ్బారావుగారికి పదిహేనో ఏటనే క్షయవ్యాధి వచ్చినది. పినతండ్రి లక్ష్మణరావుగారే చికిత్స చేయించి నివారణ చేయించారు. సుబ్బారావుగారి అన్న పేరు శేషగిరిరావు, తమ్ముడి పేరు రంగారావు. సతీమణి పేరు రంగనాయకి యనీ- సంతానం ఆయన రచించిన కావ్యాలేనంటారు.

తన్ను పెంచి పెద్దచేసిన పినతండ్రి లక్ష్మణరావుగారి పట్ల కృతజ్ఞతతో 'శ్రీ కుమారాభ్యుదయం' అను ప్రబంధ గ్రంథాన్ని రచించి ఆయన అంకితమిచ్చారు. ఆ ప్రబంధం ఆనాటి కవిపండితుల ప్రశంసలను సంపాదించింది. ఆయన ప్రతిభ కది తొలిమణిహారం.

శ్రీ సుబ్బారావుగారు 1893- 1904 మధ్య కాలం పదకొండేడ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేశారు. అనన్తరం ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో 1904 - 1920 సం॥రాల మధ్యకాలంలో తెలుగు పండితులుగా పనిచేశారు. ఆయన ఆ ఉద్యోగంలో చేరేముందు మహాకవి కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఆ పండిత (ఆచార్య) పదవిలో ఉండేవారు. సుబ్బారావుగారి అనన్తరం అక్కిరాజు ఉమాకాంతంగారు ఆ పదవిని చేబట్టారు.

1939 సం॥ములో అనగా 66వ సంవత్సర వయసులో ఆంధ్ర వాల్మీకి సుబ్బారావుగారి అసువులు తాను నమ్మిన శ్రీరామచంద్రునిలో సాయుజ్యమొందాయి.

ఎంతమంది రామాయణ గ్రంథాలను ఎన్ని మారులు ఆంధ్రీకరించి ఉన్ననూ- 'ఆంధ్ర వాల్మీకి' యనే సార్థక నామధేయం ఒక వావిలికొలను సుబ్బారావుగారికి మాత్రమే దక్కిన మహోత్కృష్ట అదృష్టం! ●

మాతృదేవో పితృదేవో భవ అనునది ఆచరణలో చూపిన ధర్మరాజు ధర్మ బద్ధుడు!

తిక్కన సోమయాజి రచించిన 'శ్రీ మదాంధ్ర మహాభారతం'లోని శాన్తి పర్వంలో తల్లితండ్రులను ప్రత్యక్ష దైవాలుగా చిత్రించిన సందర్భం ఉన్నది-

జనకుడు దపమును ధర్మం
బును విద్యయు బరమ దైవమును గావుననా
తనికి బ్రియంబగు పనినే
సిన దేవత లెల్ల బ్రీతిచెందుట గల్గున్

- అన్నారు తిక్కన మహాశయులు.

అల్పాక్షరములతో అనల్పార్థమును సృష్టించగల మహా మేధావియైన కవితా సార్వభౌముడు. ఆయన కూర్చే అక్షర చమత్కృతి ఇతర కవులకు సాధ్యం కాదు.

ఈ సందర్భములో ధర్మరాజు యొక్క సుగుణశీలతను వ్యక్తపరిచే ఓ సన్నివేశమున్నది. అది యక్షునికీ ధర్మరాజుకీ జరిగిన సంవాదం-

'ఆకాశం కన్నా గొప్పది ఉన్నదా?' యని యక్షుడు ప్రశ్నించినప్పుడు- తక్కున ఉన్నదని ధర్మరాజు సమాధాన మిస్తాడు.

ఏవిటి- యని ప్రశ్నించినపుడు-

'తండ్రి' అంటాడు.

'ఎలా?' అని యక్షుడు ప్రశ్నార్థకంగా చూచినపుడు-

ఆకాశం నుంచి వర్షాలు కురియక, తిండి గింజలు పండక, కరువు కాటకాలు కలిగి ఆహారం లభింపక పోవచ్చును. కానీ తన తండ్రి తన సంతానానికీ, సతికి ఏలోటు రాకుండా అహరహమూ శ్రమించి పోషిస్తాడు. ఆకాశమంతటి విశాలమైన మనస్సు చేసుకుని, తాను శ్రమించి, వాళ్ళ మంచిచెడ్డల కేలోటూ రానీయడు. విద్యాబుద్ధులు కురిపిస్తూ వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. అలాటి తండ్రి మనసు ఆకాశం కన్నా విస్తీర్ణమైంది, విశాలమైనదీ' అంటూ ధర్మరాజు చెప్పగా విస్తుపోతాడు యక్షుడు.

ఇది ఇలా ఉండగా యక్షుడు మరో వరం కోరుకొమ్మన్నాడు. మరణించిన తమ్ముల్లో ఒకరిని కోరుకో వివరంగా చెబుతూ అనుగ్రహిస్తానన్నాడు. ధర్మరాజు వెంటనే సహదేవుని ప్రాణాల్ను తిరిగి అనుగ్రహించమని కోరాడు.

కుమారునికి చిన్న కష్టం కలిగిననూ భరించలేనివాడు తల్లి తరువాత తండ్రే! అలాగే 'పుత్రాదిచ్ఛేత్ పరాజయం'- ఏ తండ్రియైనా కుమారుని చేతిలో ఓడిపోవాలని కోరుకుంటాడు. వాణ్ణి తన సౌభాగ్య వారాశిగా తలుస్తాడు.

ఈ విషయంగానే ఓ మొగలాయి చక్రవర్తి కథను ఉదాహరణంగా చెప్పుకోవాలి. భారత దేశాన్ని పాలించిన మొగలాయి చక్రవర్తి బాబర్ విషయంలో ప్రత్యక్ష నిదర్శనంగా జరిగిన విషయం-

బాబర్ కొడుకు హుమాయూన్. దారుణమైన రోగం వాతబడ్డాడు. మంచం పట్టాడు. రోగనివారణం కాలేదు. రాజ వైద్యులు పెదవివిరిచారు. కుమారునిపై ప్రాణాలు పెట్టుకున్న బాబర్ ఆ రాత్రి అంతా ఆలోచించాడు. అల్లాను ప్రార్థించాడు. హుమాయూన్ మంచం చుట్టూ మూడు ప్రదక్షిణల్జేసి, తన కుమారునికి మారుగా తన్ను తీసుకొని పామ్మని ప్రార్థించాడు. అల్లా అనుగ్రహించినట్టుగ హుమాయూన్ కోలుకొన్నాడు, బాబర్ మరణించాడు. ఇదీ తండ్రి ప్రేమ. ఇది చరిత్రలో జరిగిన విషయం.


యక్షుడు ఆశ్చర్యపోయాడు. కురుపాండవ యుద్ధం వస్తూంది. అది భయంకర సంగ్రామం. వీరులైన తమ్ములు భీమార్జునుల ప్రాణం కోరుకోకుండా సహదేవుని ప్రాణం కోరుకున్నావేమిటని ప్రశ్నించగా-

యక్షరాజా- మా తండ్రి పాండురాజు గారికి ఇరువురు భార్యలు, కుంతి, మాద్రి. కుంతీ సంతానంలో నేనున్నాను. భీమార్జునుల ప్రాణాన్ని కోరుకోవడం స్వార్థమవుతుంది. సవతితల్లి మాద్రి సంతానంలో పిన్నవాడైన సహదేవుణ్ణి బ్రతికించుకుంటే ఇరువురి తల్లుల బిడ్డలమూ జీవించినట్లుంటుంది. పరలోకంలో ఉన్న తండ్రిగారు కూడా సంతోషిస్తారు. అని ధర్మరాజు యక్షునితో అనడంతో యక్షుడు ధర్మరాజు ధర్మబుద్ధిని ఎంతగానో మెచ్చుకున్నాడు.

ధర్మరాజా! నీ ధర్మగుణం బహు శ్లాఘ్యనీయమైనది. నేను నీ తమ్ములందర్నీ పునర్జీవుల్ని కావిస్తున్నాను. రాబోవు కురుక్షేత్ర సంగ్రామంలో మీకు విజయము తథ్యమగుకాక అంటూ వాళ్లు నల్వురినీ పునర్జీవున్ని కావిస్తూ ప్రాణదానం చేస్తాడు.

భారత ధర్మం చాలా గొప్పది. నీతిదాయకమైనది. సత్యబద్ధమైనది. తండ్రి తరువాత తండ్రిలాటి వాడు అన్న, ఈలాటి ధర్మాల్ని ఎన్నో తెలియచేసింది కాబట్టే 'మహాభారతం' పంచమ వేదమైంది. ●

రామునికే గాకుండా భరత, లక్ష్మణ, శతృఘ్నులకూ ఆలయాలున్నాయ్!



ఆంధ్రదేశంలో రామాలయం లేదా రామ మందిరం ఉండని గ్రామం ఉండదు. ముంబాయిలో సీతా రామకల్యాణం చేయని ప్రదేశం ఉండదు.

అయితే మనం కేరళను కమ్యూనిష్టు ప్రదేశమనీ, ముస్లిము జనాభా ఎక్కువయనీ పొరబాటు పడుతుంటాం. అక్కడున్న బృహదాలయాలు ఎక్కడా లేవు. అనంత పద్మనాభస్వామి ఆలయం గానీ, గురువాయూరప్పన్ ఆలయం గానీ, శబరిమల గానీ (ఆలయం చిన్నది- మహిమ పెద్దదీ) స్త్రీల శబరిమలగా కీర్తించే తిరువనంతపురం లోని భగవతి అమ్మన్ ఆలయాలున్నాయ్. శబరిమలై భక్తులు ప్రస్తుతం ఆసేతు హిమాచల పర్యంతమూ వ్యాపించి యున్నారు. కోవెల తెరచిన ప్రతీసారీ కోకొల్లలుగా భక్తులు వెడుతుంటారు.

ఎన్నో ప్రదేశాల్లో ఎన్నో రామాలయాలున్నప్పటికినీ సీతారాముల పాదాల చెంత నమస్కారంతో ఆంజనేయస్వామీ ఉంటారు. భద్రాచలంలో రామాంకంపై సీతమ్మ తల్లి, ప్రక్కన విడిగా లక్ష్మణుడూ నిలిచి ఉంటాడు. ఒక్క అయోధ్య (ఉత్తరప్రదేశ్)లో మాత్రం రామలక్ష్మణ భరత, శతృఘ్నులు బాలకులవలె కనిపిస్తారు.

కానీ కేరళలో మాత్రం శ్రీరామునికీ, లక్ష్మణునికీ, భరతునికీ, లక్ష్మణునికీ, శతృఘ్నునికీ విడి విడి గ్రామాల్లో విడివిడిగా ఆలయాలున్నాయట. ఒకే రోజులో ఆ నాలుగు ఆలయాలను దర్శించి రావచ్చునంటూ ఓ విశ్వనీయ విషయాన్ని విన్నాను. ఆ యాత్రను నలంబలమ్ అంటారుట. మలయాళ నెలల్లో చివరిదైన కార్కిదకం మాసంలో అనగా జులై, 17 ఆగస్టు 16 మధ్య ఈ నాలుగు ఆలయాలను చుట్టివస్తే కరువుకాటకాలుండవనీ కొందరి విశ్వాసం. సర్వసాధారణంగా అది వ్యాధులు సంక్రమించే కాలం.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడు ఈ నాలుగు ఆలయాలను దర్శించి, పూజించాడంటారు. అయితే ద్వాపరయుగాంతంలో సాగరం పొంగి, ఈ విగ్రహాలు నీటిలో మునిగిపోయాయట. కేరళలోని పొన్నాని ప్రాంతాన్ని పాలించే ఆయిరర్ కావిలకమ్ ఆస్థానంలోని మంత్రి వాక్యయల్ కైమల్ అనే ఆయనకు కలలో ఈ విగ్రహాలు కనిపించాయట. ఆ మర్నాడు ఆయన సముద్రపు తీరానికి వెళ్లి మత్స్యకారులను పిలిపించి ఆ విగ్రహాలను వెదికి తెప్పించి, నలుగురు అన్నదమ్ముల విగ్రహాలనూ, నాలుగు ప్రాంతాల్లో ప్రతిష్ఠించి నాలుగు ఆలయాలను నిర్మించాడని ఓ చరితం ఉన్నది.

ప్రాచీన తాళపత్రగ్రంథాల్లో కూడా ఈ విషయం ఉందని అంటారు. దానిలో వ్రాసినట్టు ఈ నాలుగు ఆలయాలకూ వెళ్లి, విడి విడి ఆలయాల్లో ఉన్న రామ, భరత, లక్ష్మణ, శతృఘ్నులను దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయంటారు. అయితే వరుస క్రమంలో వారిని దర్శించుకోవాలి. తిరుచ్చి (త్రిచ్చి) జిల్లాలో ఉన్న రామాపురంలోని రామాలయంలోని శ్రీరాముణ్ణి వేకువఝామున దర్శించడంతో ప్రారంభించి, సాయం సమయానికి పాయమ్మాళ్‌లో ఉన్న శతృఘ్నుని గుడిలో శతృఘ్నుణ్ణి దర్శించడంతో యాత్ర పూర్తియవుతుంది.

వేకువన శ్రీరాముణ్ణి దర్శించి, సూర్యోదయ సమయంలో భరతుణ్ణి దర్శించాలి. తదుపరి లక్ష్మణుని ఆలయానికి వెళ్లి, సాయంత్రానికి శతృఘ్నుని దర్శించాలట.

తిరుపురయార్‌లో రాముడున్నాడు. ఈ ఆలయం తీవ్రా నది ఒడ్డున ఉన్నది. ఈ నదిని పురయార్ నదియని కూడా అంటారు. అందుకే ఈ ఊరికి తిరుపురయార్ అనే పేరు వచ్చింది. ఇక్కడి శ్రీరాముడు చతుర్భుజుడు. ఇరు ప్రక్కలా శ్రీదేవి భూదేవి ఉంటారు.

(ఈ ఆలయానికి 23 కి.మీటర్లలో గురువాయార్ శ్రీ కృష్ణాలయం ఉన్నది.

తిరుచ్చిలోని ఇరింజలక్కడలో భరతుని ఆలయం ఉన్నది. ఇది ఎనిమిదవ శతాబ్దానికి ముందుగానే నిర్మించినట్టు చరిత్ర చెబుతూంది. ఇక్కడి భరతుని పూజకు దీపారాధనలూ, అగరు వత్తులు వెలిగించడం, ధూపం ఏవీ ఉండవు. తామరపూలు తులసీ మాలలతోనే ఈయన్ను పూజించాలి. 101 తామర పూలు గల మాలను ఆయన మెడలో వేసినచో కోరిన కోరికలు తీరుతాయట. ఈ భరతుణ్ణి రోగాల్ను పోగొట్టే ధన్వంతరిగా కూడా కొలుస్తారు. ఆలయం చుట్టూ నాలుగు సరస్సులతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుందంటారు. ప్రతీ యేటా ఏప్రిల్ నెలలో ఇక్కడ జరిగే ఉత్సవంలో పాల్గొనే అలంకృతమైన 17 ఏనుగుల్ని చూడడం ఆహ్లాదకరంగా ఉంటుంది.

నలంబలమ్ యాత్రలోని మూడవ ఆలయం లక్ష్మణుని ఆలయం ఎర్నాకుళం - త్రిచూర్ జిల్లాల నడుమ ఉన్నది. ఈ ప్రాంతాన్ని మాఝికుళం అంటారు. ఇక్కడ కల లక్ష్మణున్ని దర్శించుకున్న తరువాత వినాయకుణ్ణి, శివుణ్ణి పూజించి మరల లక్ష్మణుల్ని దర్శించాలట. అయ్యప్పస్వామినీ, అమ్మవారినీ పూజించి ఆ తరువాత మరల లక్ష్మణున్ని పూజించాలంటారు.

ఆఖరి ఆలయం పాయమ్మాల్‌లో గల శతృఘ్నుడు ఈ ఆలయం భరతుని ఆలయానికి 7 కిలోమీటర్లలో ఉంటుంది. రామ, భరత, లక్ష్మణ విగ్రహాలకన్నా చిన్న విగ్రహము శతృఘ్నుని విగ్రహం. టిప్పుసుల్తాన్ దాడుల్లో ఈ ఆలయం బాగా దెబ్బతిన్నది. ఆ సమయంలో శతృఘ్నుని పంచలోహ విగ్రహాన్ని ఆలయానికి పశ్చిమంలో కల కొలనులో దాచారట. తరువాత కనిపించక పోతే గ్రానైట్ రాయితో వేరే విగ్రహం తయారుచేయించారు. ఈ విగ్రహం వెనుక శతృఘ్నుని భార్య శృతకీర్తి విగ్రహం ఉంది. ఇక్కడ ఎప్పుడూ ఓ దీపం వెలుగుతూనే ఉంటుంది.

ఈ ఆలయదర్శనంతో రామ, భరత, లక్ష్మణ, శతృఘ్ను ఆలయాల యాత్ర సంపూర్ణ మవుతుంది. ఇవి గాకుండా కేరళలోని కొట్టాయం, ఎర్నాకుళం, మలప్పరం జిల్లాల్లో కూడా రామ భరత లక్ష్మణ శతృఘ్నులు ఆలయాలున్నాయి గానీ ఇవి వీటంతటి ప్రాముఖ్యం కలవి కావు- అని అంటారు. గానీ- కేరళలోనే ఈ నలుగురి అన్నదమ్ముల ఆలయాల్ను చూచే అవకాశం ఉన్నది. ●

కూచిమంచి తిమ్మకవి

అచ్చతెనుగు రామాయణం వ్రాసిన కవిగా సుప్రసిద్ధుడైన కూచిమంచి తిమ్మకవి ఆంధ్ర సాహిత్య చరిత్రలో ప్రముఖమైన స్థానం పొందగలిగాడు. ఈయన 17-18 శతాబ్దాల మధ్యకాలంవాడు. తూర్పుగోదావరి మండలంలోని పిఠాపురం ప్రాంతాలలో ఉన్న 'కందరాడ' గ్రామానికి కరణంగా ఉండేవారు. ఈయన 9 పద్యకావ్యాలు, 3 శతకాలు, 1 లక్షణ గ్రంథం, మరొక ద్విపద కావ్యం, 1 దండకం వ్రాశాడు. పదకావ్యాల్లో రెండు పూర్తిగా అచ్చతెనుగులో వ్రాయబడినాయి. ఈయన వ్రాసిన 3 శతకాల్లోను ముఖ్యమైంది. 'కుక్కుటేశ్వర శతకం' పిఠాపురం చివర నున్న 'కుక్కుటేశ్వర స్వామిని' సంబోధిస్తూ వ్రాయబడిన కుక్కుటేశ్వర శతకాన్ని కవి తన వార్ధక్యంలో వ్రాసినట్లు తెలుస్తోంది. ఈ శతకంలో కవి తన భక్తిభావాన్ని వెలిబుచ్చటంతో బాటు లోభులను దుయ్యబడుతూ, నీతులను అన్యాపదేశంగా ఆవిష్కరిస్తూ అనేక పద్యాలు వ్రాశాడు. ఆ రోజుల్లో ప్రచారంలోకి వచ్చిన ఈ శతకాన్ని అనుసరిస్తూ అనేకులు శతకాలు వ్రాశారు. ఈ కోవలో ఈ శతకం మణిపూస తొలిపూస అన్నారు ఆరుద్ర. డెబ్భయి సంవత్సరాల లోకానుభవాన్ని చెప్పిన శతకం, లోకానికి హితబోధ చెయ్యడం దీని ప్రత్యేకత. సంఘ సంస్కరణకు ఇటువంటి శతకాలు ఆవశ్యకాలనటంలో సందేహం లేదు. కూచిమంచి వారి కుక్కుటేశ్వర శతకంలో నుంచి రెండుమూడు పద్యాలు :

బావిలోపల పడ్డ పాము వెడలింప
జనువాని కరువక చనగ గలదె
చిచ్చులో బడెడు వృశ్చికమును వెడలింప
జనువాని మీటక సడల గలదె
పెను వెల్లి బడిపోవు బెబ్బులి బరికింప
జనువాని మ్రింగక మనుప గలదె
బురద గోతను బడ్డ పొట్లావు నెగనెత్త
జనువాని బొడువక జరుగ గలదె?
అవని లోపల ఖలుని నెయ్యంబు మీఱ
మనుప జనువాని చెఱపక మాన గలదె?
భూనుత విలాస! పీఠికాపుర నివాస!
కుముద హితకోటి సంకాశ! కుక్కుటేశ!

'భూనత విలాస' భూజనుల చేత స్తుతింపబడుతున్న విలాసములు కలవాడా.. 'కుముదహిత కోటి సంకాశ' కుముదహితుడు అంటే చంద్రుడు. కలువలకు ప్రియుడు. కోటిచంద్రుల కాంతితో సమానమైన ఆహ్లాదకరమైన వెన్నెలలు ప్రసరింప జేసేవాడా... పీఠాకాపుర నివాసుడవై యున్న ఓ కుక్కుటేశ్వరా! ఈ శతకం ద్వారా నేను చేసుకుంటున్న మనవిని వినవయ్యా.

ప్రపంచంలో అధముడైన, నీచుడైన, క్రూరుడైన, దుష్టునితో, దుర్మార్గునితో, దుర్మదాంధుని స్నేహం చేస్తూ జీవిద్దామని ఎవరైన ఆప్రయత్నం చేసేటట్టైతే ఆ మహానుభావుడు ఈ అమాయకుణ్ణి బ్రతికి బట్టకట్టనిస్తాడా? అసంభవం. బావిలో పడిపోయిందే పాము - అయ్యో దాన్ని బయటికి తీద్దాం అని తీస్తే- అది కాటువెయ్యకుండా ఉంటుందా- అగ్నిలో పడిపోయిన తేలును రక్షించినా, పెద్దప్రవాహంలో కొట్టుకుపోయే పెద్దపులిని కాపాడినా, బురదగోతిలో జారిపడిపోయిన పొట్లావును పైకిలేవనెత్తినా వాటి నైజ ప్రవృత్తిలో ఏ మాత్రం తేడా ఉండదు. వాటిది స్వతస్సిద్ధమైన హింసా ప్రవృత్తి. ఈ ఖలునిది కూడా అటువంటి స్వభావమే! కాబట్టి ఓ మహాజనులారా! మీ జాగ్రత్తలో మీరుండి. దుష్టునకు దూరంగా ఉండండి అంటున్నాడు:

నిరతాన్నదాన వైఖరి జెలంగెడి వారు
నెనరొప్ప ధీనుల మనుచువారు
గోవిప్ర బాంధవ గురుభక్తి గలవారు
శివు విష్ణు బూజలు సేయువారు
పరధన పరవధూ పరత జెందని వారు
పరహితాచరుణులై పరగువారు
సుజ్ఞాన సహితులై సొబదు మీఱెడి వారు
సత్యవచోరూఢి సలుపువారు
తలపులోపల ననయంబు ధర్మకార్య
నిష్ఠ గలవార లందఱు నీకు ప్రియులు
భూనుత విలాస! పీఠికాపుర నివాస!
కుముదహితకోటి సంకాశ! కుక్కుటేశ!

ఇక్కడ, ఈ పద్యంలో మంచివాళ్లను ప్రస్తుతిస్తున్నాడు కవి. నిత్యం అన్నదానం చేస్తేగాని సంతృప్తిచెందనివారు, ప్రేమతో దీనజనులను ఆదుకునేవారు. గోవిప్ర బాంధవ గురుశ్రేష్ఠులయెడ భక్తిభావం కలిగియుండేవారు. శివవిష్ణు పూజాతత్పరులైన వారు, పరుల ధనం యెడలగాని, పరకాంత యెడల గాని వ్యామోహం చెందని వారున్నూ, మంచి జ్ఞానం కలిగియుండటమే తమకున్న ఆకర్షణగా భావించేవారు, ఎల్లప్పుడూ సత్యవాక్పరిపాలన చేస్తూ జీవిస్తున్నవారు - వీరందరూ - మనసా ధర్మకార్యనిష్ఠాపరులుగా గుర్తింపబడుతూ ఉంటారు. ఓ కుక్కుటేశ్వరా! వీరే గదా నీకు ప్రియమైనవారు - ఇష్టమైనవారు - నీవు అభిమానించే భక్తులు- అని సంబోధిస్తున్నాడు కూచిమంచి తిమ్మకవి.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ 'అద్వేష్టా సర్వభూతానం మైత్రః కరుణ ఏవచ' - అని. భక్తుడైన వాడికి సర్వభూతముల యందు ద్వేషభావం లేకుండుటయే కాకుండా దయా సుహృద్భావాలు కలిగి యుండాలని పరమాత్మ చెబుతాడు. కూచిమంచి తిమ్మకవి దాని సారాంశాన్నే సామాన్యులకు సుబోధకమయ్యేటట్టు విశదీకరించాడు..

నటుని పోల్కి ననేక నామరూప విభేద
ములు పూని శుభలీల చెలగువాని
తవిలి పూసలలోని దారంబు కైపడి
జగదంత రాత్మయై నెగడువాని
ఐంద్ర జాలికు రీతి నఖిలంబు నుద్భవ
స్థితిలయంబుల నొందజేయువాని
విపులాంబువులు ప్రతిబింబితుండా హేళి
వలె సర్వసాక్షియై వెలుగువాని
నిన్ను సేవింతు భావింతు సన్నుతింతు
ప్రేమ యేపార సాక్షాత్కరింపు మయ్య!
భూనుత విలాస! పీఠికాపుర నివాస
కుముదహితకోటి సంకాశ! కుక్కుటే!

కూచిమంచి తిమ్మకవి తాను రచించిన కుక్కుటేశ్వర శతకంలో రూపొందించిన ఒక భక్తిరస కలశం ఈ పద్యం. పేరు ఏదైనే నేమి, రూపమేదైతే ఏమి భగవంతు డనేవాడు ఒకడే- అని ఉత్తమోత్తమమైన సందేశాన్ని అందిస్తోందీ పద్యం. నాటకాల్లో వేసే నటుడు ఒక రోజు శ్రీరాముని పాత్ర పోషిస్తాడు. మరొక రోజు శ్రీకృష్ణుని పాత్ర ధరిస్తాడు. వ్యక్తి ఒక్కడే. రంగురంగులు పూసలు పెద్దవి- చిన్నవి- ఏవైతే నేమి- లోపల వాటన్నిటికి ఆధారభూతమైన హారంగా తీర్చిదిద్దేది ఒకే దారం. ఇంద్రజాలికుడు - అనేక తమాషాలు చేస్తాడు. ఒక త్రాడు చూపి రిబ్బనుగా పుట్టిస్తాడు. రిబ్బను చుట్టుచుట్టి జెండాగా రూపొందజేస్తాడు. అగ్నిని నోటిలో మండించి గాలిలో ఆర్పేస్తాడు. ఎన్నో వింతలు విడ్డూరాలు. ఇటువంటివే ప్రపంచంలో సృష్టి స్థితిలయాలన్నీ భగవద్విలాసాలు. ●

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ

మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే

అ ఆ

259 నెలలుగా
259 సంచికలను

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల జోడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు

చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

